క్లుప్తంగా

ఆటో డ్రైవర్లకు ఖాకీ దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న శేఖర్

కూసుమంచి: మండలంలోని నాయకన్‌గూడెంలో నామ ముత్తయ్య ట్రస్ట్ ఆధ్వర్యాన బుధవారం ఆటోడ్రైవర్లకు ఖాకీ దుస్తులను డీసీసీబీ డైరెక్టర్ ఇంటూరి శేఖర్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాసాని సైదులు, టెలికం సలహామండలి సభ్యుడు చిత్తారు సింహాద్రి, సేవా సమితి బాధ్యులు చీకటి రాంబాబు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు వేముల వీరయ్య, మల్లీడు వెంకన్న పాల్గొన్నారు.

తపాల బీమా చెక్కు అందజేత

నేలకొండపల్లి: గ్రామీణ తపాల జీవిత బీమా చెక్కును నేలకొండపల్లి సబ్ పోస్ట్‌మాస్టర్ చామకూరి మల్లయ్య చేతుల మీదుగా బాధితులకు అందించారు. మండల కేంద్రంలో ఇటీవల బీమా తీసుకున్న శివబాబు మృతి చెందడంతో మృతుడి తల్లి నామినికి రూ.3,28,800 చెక్కును పోస్టాఫీస్ వద్ద అందించారు. ఈ కార్యక్రమంలో బీపీఎంలు కణతాల గోవిందరావు, పి.వంశీ, ప్రణయ్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌లో హరితహారం

రఘునాథపాలెం: రఘునాథపాలెం పోలీస్ స్టేషన్‌లో బుధవారం హరితహారంలో భాగంగా మొక్కలు నాటారు. టాప్‌గ్రో ఫర్టిలైజర్ ప్రైవేట్ కంపెనీ సహకారంతో కల్పతరు మిషన్‌లో భాగంగా స్టేషన్ ఆవరణంలో ఎస్‌ఐ కొండలరావు ఆధ్వర్యాన మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుళ్లు, కంపెనీ ప్రతినిధులు డీజీఎం చారి, నాగరాజు, ఉపేందర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా డ్రెయినేజీ వ్యవస్థ



చెరువును తలపిస్తున్న రోడ్డును చూపిస్తున్న సలాం

ఖమ్మం మామిళ్లగూడెం: చినుకు పడితే నగరంలోని పలు ప్రాంతాల రోడ్లు చెరువును తలపిస్తున్నాయని సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మహమ్మద్ సలాం ఆరోపించారు. బుధవారం మయూరిసెంటర్, పాత బస్టాండ్ తదితర ప్రాంతాల్లో పర్యటించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. నగరంలో రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ పూర్తిగా అధ్వానంగా మారిందని, ప్రజాప్రతినిధులు ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర సహాయ కార్యదర్శి సాంబశివారెడ్డి, ఎండీ. రెహమాన్, సైదా, చాంద్, ఇక్బాల్, రమణ తదితరులు పాల్గొన్నారు.

కేరళ నిట్‌లో ఖమ్మం విద్యార్థికి సీటు



మనీషాకు కేక్ తినిపిస్తున్న తల్లిదండ్రులు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మంలోని అంబేద్కర్ గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేసిన నూకల మనీషాకు కేరళ రాష్ట్రం కాలికట్‌లోని నిట్‌లో ఇంజనీరింగ్ సీటు లభించింది. నేలకొండపల్లిలో ప్రాథమిక విద్య పూర్తిచేసిన ఆమె హైస్కూల్ విద్య ఖమ్మంలో, ఇంటర్ విద్యను అంబేద్కర్ గురుకులంలో పూర్తిచేసింది. ఈ ఏడాది నిర్వహించిన జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ కనబరిచి నిట్‌లో సాధించగా... అథ్లెటిక్స్‌లోనూ రాష్ట్రస్థాయిలో రాణించడం విశేషం. ఈసందర్భంగా మనీషాను తల్లిదండ్రులు శిరీష – దానకర్ణతో పాటు అంబేద్కర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చావా జ్యోతి, గురుకులాల ఆర్‌సీఓ ప్రత్యూష తదితరులు అభినందించారు.

నగరంలో సినిమాలు

తిరుమల	బేబి
వినోద	జైలర్
సాయిరాం	జైలర్
ఆదిత్య	బ్రో
శ్రీనివాస	భోళాశంకర్
సుందర్	ఉస్తాద్

- ఖమ్మంగాంధీచౌక్

శరవేగంగా రోడ్డు విస్తరణ

- ఖమ్మం – ఇల్లెందు రహదారిలో నాలుగు లైన్లుగా విస్తరణ
- రఘునాథపాలెం మండల కేంద్రంలో చకచకా సాగుతున్న పనులు
- రూ.5 కోట్ల వ్యయంతో రోడ్డు, డివైడర్ నిర్మాణం



శరవేగంగా సాగుతున్న నాలుగు లైన్ల విస్తరణ పనులు

రఘునాథపాలెం: మండల కేంద్రమైన రఘునాథపాలెంలో రహదారి విస్తరణ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. కోయచలక క్రాస్ నుంచి మండల కార్యాలయాల కాంప్లెక్స్ వరకు ఖమ్మం – ఇల్లెందు ప్రధాన రోడ్డులో నాలుగులైన్లు రోడ్డు విస్తరణ, డివైడర్ నిర్మాణ పనులు చేపట్టారు. సుడా నుంచి విడుదలైన రూ.5కోట్ల నిధులు కేటాయించి నెల క్రితం ఈ పనులు మొదలుపెట్టగా.. పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

ప్రమాదాలు జరగకుండా..

గతంలో కోయచలక క్రాస్ వరకు ఉన్న నాలుగు లైన్ల రోడ్డును మండల కార్యాలయాల సమీపంలోని సుడా పార్కు వరకు సుమారు 1.3 కిలోమీటర్ల దూరం వరకు విస్తరిస్తున్నారు. ఇప్పటికే భారీ చెట్లను తొలగించి పనులు చేపట్టారు. రఘునాథపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మూలమలుపు, లోతుగా ఉన్న రోడ్డును ఎత్తు పెంచి మలుపులు లేకుండా పనులు సాగిస్తున్నారు. గతంలో ఇక్కడ అనేక ప్రమాదాలు చోటు చేసుకుని పలువురు మృత్యువాత పడ్డారు. దీంతో మళ్లీ ఇలాంటివి జరగకుండా రోడ్డు ఎత్తును పెంచినట్లు అధికారులు తెలిపారు. తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా జింకలతండా క్రాస్ రోడ్డు జంక్షన్‌లో రింగ్ నిర్మించనుండగా రాకపోకలు సాఫీగా సాగనున్నాయి.

ఇప్పటికే జంక్షన్!

ఇప్పటికే ఈ ప్రాంతంలో ఎంపీడీఓ, తహసీల్దార్, పోలీసు స్టేషన్ కార్యాలయాలు నిర్మాణం పూర్తయి కార్యకలాపాలు సాగుతున్నాయి. అలాగే, 14 ఎకరాల్లో సుడా పార్కు, సమీపంలోనే గిరిజన గురుకుల పాఠశాల, విత్తనగిడ్డంగి, గోదాంల నిర్మాణం, రైతు వేదిక, మట్టి నమూనా పరిశోధన కేంద్రాలు ఉండగా ఈ ప్రాంతం జంక్షన్‌గా మారింది. ప్రస్తుతం రోడ్డు విస్తరణ పనులు పూర్తయి, డివైడర్ నిర్మించి సెంట్రల్ లైటింగ్ సిద్ధమైతే ఇల్లెందు రోడ్డులో జంక్షన్‌గా రూపాంతరం చెందనుంది. మండలంలో అభివృద్ధి పనులపై మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఎమ్మెల్యే గ్రాంట్ నిధులన్నీ వెచ్చిస్తుండడమే కాక సుడా నిధులు సైతం విడుదల చేయిస్తుండడంతో అభివృద్ధి పనులు చకచకా సాగుతున్నాయి.



జింకలతండా క్రాస్ రోడ్డులో జంక్షన్ నిర్మాణం ఇలా..

‘గృహలక్ష్మి’ సర్వే పక్కాగా ఉండాలి



నేలకొండపల్లి: కోనాయిగూడెంలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీఓ శివ



శివాయిగూడెంలో విచారణ తీరును తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ

నేలకొండపల్లి: గృహలక్ష్మి దరఖాస్తుల పరిశీలన పక్కాగా చేపట్టాలని మండల పంచాయతీ అధికారి (ఎంపీఓ) సీహెచ్.శివ ఆదేశించారు. మండలంలోని కోనాయిగూడెంలో గృహలక్ష్మి సర్వేను బుధవారం పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అందించిన ఫార్మాట్ ప్రకారం గడువులోగా సర్వే పూర్తి చేసి జాబితాను అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బోల్ల వీరబాబు, గ్రామదీపిక, ఐకేపీ సీసీ, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. నేలకొండపల్లి మేజర్ పంచాయతీలో కార్యదర్శి దేవేందర్ ఆధ్వర్యాన సర్వే చేపట్టారు.

కూసుమంచి మండలంలో..

కూసుమంచి: మండలం నుంచి గృహలక్ష్మి పథకానికి వచ్చిన 3500లకు పైగా దరఖాస్తులను అధికారులు దరఖాస్తు చేసుకున్న వారి ఇళ్లకు వద్దకు వెళ్లి వివరాలను నమోదు చేసుకున్నారు. అనంతరం ఈ నివేదికను ఉన్నతాధికారులకు అందించనున్నట్లు తహసీల్దార్ సంపత్‌కుమార్ తెలిపారు.

శివాయిగూడెం, పువ్వాడనగర్‌లో తనిఖీ చేసిన ఎంపీడీఓ..

రఘునాథపాలెం: ఖమ్మంఅర్బన్, రఘునాథపాలెం మండలాల్లోని గృహలక్ష్మి దరఖాస్తుల పరిశీలనకు ఏర్పాటు చేసిన ప్రత్యేక టీంల ద్వారా పరిశీలన కొనసాగుతోంది. బుధవారం విచారణ తీరుపై ఎంపీడీఓ రామకృష్ణ మండలంలోని శివాయిగూడెం, పువ్వాడనగర్ పంచాయతీల్లో తనిఖీలు చేసి విచారణ తీరు అడిగి తెలుసుకుని లబ్ధిదారులతో మాట్లాడారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

నేలకొండపల్లి: పశువుల్లో ముద్ద చర్మవ్యాధి రాకుండా ఉండేందుకు మండలంలోని కోనాయిగూడెంలో మండల పశు వైద్యాధికారి టి.సంజయ్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత గాలికుంటు నివారణ టీకాలు వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెల్లపశువుల్లో ముద్దచర్మ వ్యాధిపై రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం 500 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు, నట్టల నివారణ మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెంటమళ్ల పుల్లమ్మ, ఉప సర్పంచ్ వడ్లమూడి నర్సయ్య, కార్యదర్శి బోల్ల వీరబాబు, వెటర్నరీ అసిస్టెంట్ టి.మురళీ, కన్వీనర్ వెంకటేశ్వర్లుతో పాటు పాండు, నరేష్, బొమ్మిశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



నట్టల మందు పంపిణీ చేస్తున్న వైద్యాధికారి

బీఎస్పీ కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న వెంకటేశ్వరావు

కూసుమంచి: మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన బీఎస్పీ ప్రాంతీయ కార్యాలయాన్ని బుధవారం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, పాలేరు ఇన్‌చార్జ్ డాక్టర్ అల్లిక వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బహుజనులకు రాజ్యాధికారమే ధ్యేయంగా తమ పార్టీ పనిచేస్తుందని, వచ్చే ఎన్నికల్లో పాలేరులో జెండా ఎగురవేయడం ఖాయమన్నారు. పాలేరు నియోజకవర్గంలో 20వేలు ఓట్లున్న రెండు అగ్రకులాల వారు ఎమ్మెల్యేలుగా చలామణి అవుతుంటే.. 2లక్షల ఓట్లున్న బహుజనులు ఎందుకు కాకూడదని ప్రశ్నించారు. రాజ్యాధికారం పేరుతో ఇంటింటికి తిరిగి తమ పార్టీ విధివిధానాలను వివరిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌నాయక్, పాలేరు ఇన్‌చార్జ్ హలావత్ పీక్యా నాయక్, అధ్యక్షుడు ఎన్నబోయిన రమేష్, జిల్లా మహిళా కన్వీనర్ ఉప్పల మంజులతో పాటు బచ్చలికూర శ్రీకాంత్, సాయిచరణ్, బుర్రా ఉపేందర్ పాల్గొన్నారు.

గొల్లగూడెం గోశాలకు దాణ వితరణ

ఖమ్మంగాంధీచౌక్/ఖమ్మంఅర్బన్: శ్రీ స్తంభాద్రి సేవా సమితి ఆధ్వర్యాన నగరంలోని కరిగిరి శ్రీ రంగనాథ స్వామి దేవస్థానం, గొల్లగూడెం ఓం శ్రీ కృష్ణ గోశాలకు బుధవారం దాణ, మేత వరిగడ్డిని వితరణ చేశారు. బహుళ అమావాస్యను పురస్కరించుకొని స్థానిక దాల్ మిల్లులు, తవుడు వర్కింగ్ యూనియన్ యజమానులు, గో ప్రేమికులు, శ్రీ స్తంభాద్రి సేవా సమితి ప్రతినిధులు, సభ్యులు, వ్యాపార సంస్థల ప్రతినిధులు తవుడు, మినప, పెసర, కంది చున్నీలు, బెల్లం, ఆకుకూరలు, కూరగాయలు, అరటి పండ్లు, ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిషన్ వ్యాపారి కందిబండ నర్సింహారావు–వాణి దంపతులు రూ.80 వేల విలువైన వరిగడ్డిని వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ స్తంభాద్రి సేవా సమితి కన్వీనర్ తూములూరి లక్ష్మీనరసింహారావు, కార్యదర్శి పెనుగొండ శ్రీనివాసరావు, సభ్యులు సూరినేటి మల్లేశం, జంగిలి రమణ, దేవరశెట్టి రామారావు, సోమారపు సుధీర్‌కుమార్, పులిపాటి సంపత్‌కుమార్, వంగవీటి నవీన్, పెనుగొండ రామ్మోహన్‌రావు, సిరికొండ వెంకటేశ్వర్లు, సూర్యనారాయణ, ఇద్దిగాని నాగేశ్వరరావు, చల్లా రమేష్‌లు పాల్గొని గోశాల నిర్వాహకులు కేసా హనుమంతరావు, చైన్సింగ్ రాజపురోహిత్‌లకు దాణను, వరిగడ్డిని అందజేశారు.



దాణ వితరణ చేస్తున్న శ్రీ స్తంభాద్రి సేవా సమితి ప్రతినిధులు

ఈనెల 18న డేర్ కళాశాలలో జాబ్ మేళా

ఖమ్మంరూరల్: మండలంలోని సత్యనారాయణపురంలో గల డేర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 18న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు డేర్ కళాశాల అధినేత దరిపల్లి కిరణ్ తెలిపారు. సాఫ్ట్‌వేర్ కంపెనీ, బ్యాంకింగ్‌లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలకు ఏదైనా డిగ్రీ అర్హత కల్గిన వారు అర్హులని తెలిపారు.

‘హార్వెస్ట్’లో విద్యార్థి నాయకుల ప్రమాణస్వీకారం



విద్యార్థి నాయకులతో ఏసీపీ, పాఠశాల యాజమాన్యం

ఖమ్మంసహకారనగర్: నగరంలోని హార్వెస్ట్ పాఠశాలలో ఇటీవల నిర్వహించిన ఎన్నికల్లో గెలుపొందిన విద్యార్థి నాయకులు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా నగర ట్రాఫిక్ ఏసీపీ సాదుల సారంగపాణి పాల్గొని అమిత్‌చంద్ర, శ్రీహాసిని, బానోత్ చరణ్‌తో ప్రమాణ స్వీకరించి మాట్లాడారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెరుగుతాయని తెలిపారు. కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతీరెడ్డితోపాటు వైస్ ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, వీ.ఎస్.ఎన్.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో కనీస సౌకర్యాలు కల్పించాలి

నేలకొండపల్లి: ప్రభుత్వాస్పత్రిలో కనీస సౌకర్యాలు కల్పించాలని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడు పసుమర్తి శ్రీనివాస్ కోరారు. ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ పుట్టిన రోజు సందర్భంగా బుధవారం స్థానిక ప్రభుత్వాస్పత్రికి డిజిటల్ బీపీ మిషన్‌ను వైద్యాధికారి కె.రాజేష్‌కు అందించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఖాళీగా ఉన్న వైద్యులు, సిబ్బంది పోస్టులను భర్తీ చేసి 24 గంటల పాటు సేవలందించేలా చూడాలని కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం చర్యలు తీసుకోకుంటే ప్రత్యక్ష ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

దేవాలయానికి కుర్చీలు, కూలర్ల వితరణ



కుర్చీలు వితరణ చేస్తున్న సృజన్‌కుమార్

నేలకొండపల్లి: స్థానిక శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయానికి నేలకొండపల్లికి చెందిన ఎన్నారై తలశీల సృజన్‌కుమార్ దాదాపు రూ.లక్ష విలువ చేసే వస్తువులను వితరణగా అందించారు. బుధవారం దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించాక 150 కుర్చీలు, రెండు కూలర్లను అందించారు. ఈ సందర్భంగా దేవాలయ ప్రతినిధులు, పంచాయతీ పాలకవర్గం సృజన్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి మేజర్ పంచాయతీ సర్పంచ్ రాయపూడి నవీన్, ఉప సర్పంచ్ లక్కం ఏడుకొండలు, దేవాలయం అర్చకులు తుపురాణి మధుసూదనాచార్యులు, గ్రామ పెద్దలు తలశీల రాధాకృష్ణ, కడియాల నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలతోనే గుర్తింపు..



ఎంపీడీఓ జయరాంను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి

తిరుమలాయపాలెం: ఉత్తమ సేవలు అందించడంతోనే ప్రజల మన్ననలు పొందుతారని పాలేరు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఇక్కడ ఎంపీడీఓగా పనిచేసి బదిలీపై సత్తుపల్లికి వెళ్తున్న బానోత్ జయరాంకు ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండలంలో పలు అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లుల రికార్డులు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్న పీఆర్ ఏఈ ఇర్ఫాన్‌పై అసహనం వ్యక్తం చేసి ఇంకా చేపట్టాల్సిన పనులను వారం రోజుల్లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. మండలానికి మరికొన్ని ఎస్‌డీఎఫ్ నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ ప్రాంత అభివృద్ధిలో తను శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా పంచాయతీ సర్పంచ్‌లు ఎంపీడీఓకు చేయించిన బంగారు కడియాన్ని ఎమ్మెల్యే అందజేశారు. ప్రస్తుత ఎంపీడీఓ శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సభలో తహసీల్దార్ రాంప్రసాద్, ఎంపీపీ మంగీలాల్, జెడ్పీటీసీ బెల్లం శ్రీనివాస్, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు ఆలస్యం నాగేశ్వరరావు, గడ్డికొప్పుల రాజు, ఎంపీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు గుగ్గిళ్ల అంబేద్కర్, సర్పంచ్ కె.వెంకటేశ్వర్లులతో పాటు చావా శివరామకృష్ణ, సీతారాంరెడ్డి, సైపుద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు గొర్రెలు పంపిణీ..

కూసుమంచి: మండలంలోని గట్టుసింగారం గ్రామానికి రెండో విడతలో మంజూరైన గొర్రెలను లబ్ధిదారులకు బుధవారం ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బానోత్ శ్రీనివాస్ నాయక్, ఆత్మా కమిటీ చైర్మన్ రామసహాయం బాలకృష్ణారెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ ఆలీ, గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం నాయకుడు బారి మల్సూర్, మాజీ సర్పంచ్ చాట్లా పరుశురాం, మాజీ ఎంపీటీసీ బందెల కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

గద్దర్, జహీరుద్దిన్ అలీఖాన్ సంస్మరణ సభ



నివాళులర్పిస్తున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: ప్రజాగాయకుడు గద్దర్, లౌకిక ప్రజాస్వామిక వాది జహీరుద్దిన్ అలీఖాన్‌ల సంస్మరణ సభను బుధవారం యూనిటీ ఆఫ్‌మాల ఆధ్వర్యాన జెడ్పీ మీటింగ్ హాల్‌లో నిర్వహించారు. ఈ సభకు సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు నున్నా నాగేశ్వరరావు, పోటు ప్రసాద్, డాక్టర్ ఎంఎఫ్ గోపినాథ్, న్యూరో సర్జన్ జగదీష్ తదితరులు పాల్గొని గద్దర్, జహీరుద్దిన్ అలీఖాన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ, భజరంగదళ్ తదితర మత సంస్థలను భూస్థాపితం చేసినప్పుడే ప్రజాస్వామ్యం బతకగలుగుతుందన్నారు. మణిపూర్‌లో జరుగుతున్న అల్లర్లు, హత్యాకాండలే ఇందుకు నిదర్శనమన్నారు. బీజీ క్లెమెంట్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజాపంథా డివిజన్ కార్యదర్శి ఆవుల అశోక్, కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బొందయ్య, యూనిటీ ఆఫ్ మాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కందుల ఉపేందర్, గుమ్మడి కనకరాజు, సుఖభోగి కోటేశ్వరావు, కనకయ్య, శౌరి, పుల్లయ్య, మధు, బందెల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మృతదేహానికి అన్నం ఫౌండేషన్ అంత్యక్రియలు



మృతదేహం వద్ద అన్నం శ్రీనివాసరావు, రైల్వే ఎస్సై భాస్కరరావు, సిబ్బంది

ఖమ్మంక్రైం: అనాథ మృతదేహానికి బుధవారం అన్నం ఫౌండేషన్ ఆధ్వర్యాన అంత్యక్రియలు నిర్వహించారు. ఇటీవల ఖమ్మం రైల్వే స్టేషన్‌లో గుర్తుతెలియని యాచకుడు(25) మృతిచెందగా.. రైల్వే పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించారు. ఈనేపథ్యంలో మృతదేహం కోసం ఎవరూ రాకపోవడంతో పంచనామా నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని రైల్వే పోలీస్ ఎస్సై పారుపల్లి భాస్కరరావు అన్నం ఫౌండేషన్‌కు అప్పగించారు. దీంతో వారు బల్లేపల్లిలోని వైకుంఠ ధామంలో దహన సంస్కారాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు



విద్యార్థికి నగదు అందిస్తున్న ప్రిన్సిపాల్ శాస్త్రి

నేలకొండపల్లి: నేలకొండపల్లికి చెందిన ఎన్నారై రాయపూడి రాంప్రసాద్ స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో గతేడాది ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో ప్రతిభ కనపరిచిన ఇద్దరు విద్యార్థులకు రూ.8వేల చొప్పున మొత్తం రూ.16 వేల నగదును ప్రిన్సిపాల్ ఎస్.ఎన్.శాస్త్రి చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. సొంత గ్రామంలో విద్యకు ప్రాధాన్యత ఇవ్వడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి డెవలప్‌మెంట్ ట్రస్ట్ ప్రతినిధి ఓరుగంటి నారాయణరావు, రాయపూడి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ రూ.5వేలకు పెంచాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న నాయకులు

తిరుమలాయపాలెం: బోదకాలు వ్యాధితో బాధపడుతున్న వారికి నెలకు రూ.5వేల పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి తిమ్మిడి హన్మంతరావు ఆధ్వర్యాన బుధవారం ఆందోళన నిర్వహించారు. అనంతరం మండలంలోని బచ్చోడు గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో హన్మంతరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎన్నబోయిన శ్రీనివాసరావు, వెంకటమ్మ, వీరమ్మ, బుచ్చమ్మ, కోటయ్య, పేరం శాంతమ్మ, పూలమ్మ తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

ఎక్కడి మురుగు అక్కడే..!



నగరంలోని 8వ డివిజన్‌లో గల గోపాలపురం వీధులు మురుగుతో కంపుకొడుతున్నాయి. ఇక్కడి వీధుల్లో సరైన డ్రెయిన్లు లేకపోవడంతో నివాసాల్లో వాడిన నీరంతా ఇదిగో ఇలా ఎక్కడికక్కడే నిలిచిపోతున్నాయి. ఈనేపథ్యాన పాఠశాల సమీపంలోని వీధులన్నీ మురికి కూపాలుగా దర్శనమిస్తూ అధ్వానంగా తయారయ్యాయి. అంతేకాక దోమలు వృద్ధి చెంది వ్యాధుల బారిన పడుతున్నామని నివాసులు వాపోతున్నారు. గత వారం ఈ ప్రాంతానికే చెందిన ఓ న్యాయవాదికి సైతం డెంగీ బారిన పడి కోలుకున్నాడు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తమ బాధలను తొలగించేలా తగు చర్యలు తీసుకోవాలని నివాసులు కోరుతున్నారు.

- ఖమ్మంఅర్బన్

ప్రశ్నించాల్సిన అధికారి : శ్రీనివాసరావు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్
సెల్ నంబర్ : 62819 48876